సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



మహిళల మనస్తత్వాన్ని మార్చలేం

ఎమ్మెల్యే కూన రవికుమార్ మహిళల మనస్తత్వం, గ్రంథాలయ వ్యవస్థలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. - 8లో



భర్తే హంతకుడు

సంతవురిటి గ్రామానికి చెందిన వివాహిత అనుమానాస్పద మృతి కేసులో భర్తే హంతకుడని పోలీసులు వెల్లడించారు. - 8లో

నివేదికలు సిద్ధం చేయండి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రధాన మంత్రి ఉచ్చాతర్ శిక్షా అభియాన్ (పీఎం ఉషా) నిధుల వినియోగం, భవిష్యత్ ప్రణాళికపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ రజిని మంగళవారం సమీక్ష నిర్వహించారు. మొదటి విడత మంజూరైన నిధులకు ఈ నెల 28లోగా డీపీఆర్ అందజేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమాలు, వర్కుషాపు నిర్వహణకు సంబంధించి ఖర్చులు చేసే నిధులపై సైతం నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్సిటీ అధికారులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ దువ్వాడపై క్రమశిక్షణ చర్యలు

- పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు

టెక్కలి: శాసనమండలి సభ్యుడు దువ్వాడ శ్రీనివాస్‌పై వైఎస్సార్‌సీపీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడటంతో దువ్వాడను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

సీఎం పర్యటనకు స్థల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: మత్స్యకార భరోసా పథకం అమలు నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 26న ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో సీఎం కార్యాలయం అధికారులు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో సాయి ప్రత్యూషతో కూడిన అధికారులు మంగళవారం స్థలం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి జింక



జింకను పరిశీలిస్తున్న అధికారులు, గ్రామస్తులు

హిరమండలం: బొమ్మిక కొండల నుంచి దారి తప్పిన ఓ జింక అవలంగి గ్రామంలోకి వచ్చింది. కుక్కలు వెంబడించడాన్ని గమనించిన గ్రామస్తులు జింకను కాపాడారు. సపర్యలు చేసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సారవకోట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఎఫ్‌బీఓ ఎం.అజయ్‌లు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. అనంతరం బొమ్మిక కొండపై వదిలేశారు.

పీత @ రూ.700



కాశీబుగ్గ : చేపల బజారులో మంగళవారం ఓ పీత అ'ధర'హో అనిపించింది. సుమారు 900 గ్రాముల బరువున్న పీత రూ.700 ధర పలికింది. ఒడిశా రాష్ట్రం చిలుకా సరస్సు నుంచి ఈ పీతను తీసుకొచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు. సుమారు 120 కిలోమీటర్ల దూరం నుంచి తెచ్చినా సజీవంగానే ఉండటంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

డైట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నేడు

శ్రీకాకుళం అర్బన్ : వమరవల్లి డైట్‌లో ఎఫ్ఎస్‌టీసీ ప్రాతిపదికన డిప్యుటేషన్ ద్వారా 5 సీనియర్ లెక్చరర్లు, 17 లెక్చరర్ పోస్టుల భర్తీకి అభ్యర్థులు బుధవారం ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డీఈఓ తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగే ఈ ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ ఆఫీసర్ ద్వారా అటస్టేషన్ చేసిన జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు మ్యుజీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా ఉపాధికల్పనాధికారి కొత్తలంక సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, మ్యూజిక్ సర్టిఫికెట్‌లో ప్లేయింగ్ ఇన్‌స్ట్రుమెంట్‌లో అనుభవం ఉన్న యువతీ, యువకులు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. 2005 జనవరి 1 2008 జూలై 1 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మే 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంపాదనకు కాదు.. సేవ చేసేందుకే.. ఐఏఎస్



అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్-2024 ఫలితాల్లో సిక్కోలు అభ్యర్థులు సత్తాచాటారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి శభాష్ అనిపించారు. అల్లాడపేటకు చెందిన బాణ్న వెంకటేష్ జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. చల్లమయ్యపేటకు చెందిన జోషిబాబు790వ ర్యాంకు, జిల్లాలో చదువుకుని ప్రస్తుతం విశాఖలో నివాసముంటున్న సాయి మోహిని మానస 973వ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారు.

సివిల్స్‌లో సిక్కోలు మెరుపులు

బాణ్న వెంకటేష్ 15వ ర్యాంకు

- కష్టపడి చదివితే ఎవరైనా సాధించొచ్చు
- సివిల్స్‌లో 15వ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది
- 'సాక్షి'తో అల్లాడపేట యువకుడు బాణ్న వెంకటేష్

అల్లాడపేట.. జలుమూరు మండలంలోని ఓ మారుమూల గ్రామం. ఇప్పుడు ఆ కుగ్రామం పేరు రాష్ట్రం మొత్తం మారుమోగుతోంది. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన సివిల్స్-2024 ఫలితాల్లో గ్రామ యువకుడు బాణ్న వెంకటేష్ జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించాడు. మొదటి ప్రయత్నంలో మెయిన్స్ వరకూ వెళ్లి, రెండో ప్రయత్నంలో 467 ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికై.. తాజాగా 15వ ర్యాంకు సాధించి తాను కలగన్న ఐఏఎస్‌కు అర్హత పొందాడు. తల్లిదండ్రులు బాణ్న చంద్రరావు, రోహిణి వ్యవసాయం చేస్తుంటారు. సోదరుడు వంశీ శ్రీహరికోటలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. 15వ ర్యాంకు సాధించిన వెంకటేష్ 'సాక్షి'తో మంగళవారం ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

తల్లిదండ్రులే స్ఫూర్తి..

'నలుగురికి ఉపయోగపడేలా పని చేయాలనే తల్లిదండ్రుల మాటలను స్ఫూర్తిగా తీసుకునే సివిల్స్‌కు సన్నద్ధమయ్యాను. సంపాదన కాదు నలుగురికి ఉపయోగపడేందుకు మార్గం కావాలని తలచి లక్షల రూపాయల జీతమిచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేశాను. వలసలు ప్రధానమైన జిల్లాకు నా వంతుగా ఏదో చేయాలని అనిపించింది. అందుకు సివిల్ సర్వీస్ ఉత్తమమని భావించి పట్టుదలగా చదివాను. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు నిత్యం ఏదో ఒక పనిపై వెళ్తుండటం గమనించాను. అందుకే వారి సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో కలెక్టర్ కావాలని నిశ్చయించుకున్నాను. తొలి ప్రయత్నంలో నిరాశ ఎదురైనా రెండో ప్రయత్నంలో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. అయినా పట్టువదలకుండా జాగ్రఫీ ఆప్షనల్‌గా తీసుకుని మరోసారి పరీక్ష రాశాను. 15వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. పట్టుదలతో చదివితే ఎవరైనా ఐఏఎస్ సాధించగలరు.' -జలుమూరు

అమ్మమ్మ ఇంట ఆనందం..

నరసన్నపేట: అల్లాడపేటకు చెందిన బాణ్న వెంకటేష్ సివిల్స్‌లో 15వ ర్యాంకు సాధించడం పట్ల అమ్మమ్మ, తాతయ్య గ్రామం బసివలసలో సంబరాలు జరుపుకొంటున్నారు. మేనల్లుడు కలెక్టర్ అవుతాడని తెలిసి మేనమామలు మెండ ఇంద్రుడు, ఢిల్లీశ్వరరావులు గ్రామంలో స్వీట్లు పంచిపెట్టారు.



తల్లిదండ్రులు రోహిణి, చంద్రరావు

పూర్వ వీసీ అభినందనలు

వెంకటేష్ 15వ ర్యాంకు సాధించడం పట్ల ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు అభినందనలు తెలియజేశారు. దీనిని ఉత్తరాంధ్ర విజయంగా అభివర్ణించారు.

జోషిబాబుకు 790వ ర్యాంకు



సివిల్ సర్వీస్ ఫలితాల్లో కోటబొమ్మాళి మండలం చలమయ్యపేటకు చెందిన లింగూడు జోషిబాబు 790వ ర్యాంకు సాధించారు. తండ్రి బాలయ్య మాజీ సైనిక ఉద్యోగి. తల్లి రాజ్యలక్ష్మి గృహిణి. జోషిబాబు 1 నుంచి 10వ తరగతి వరకు టెక్కలిలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివారు. విశాఖలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, ఆంధ్రా యూనివర్సిటీలో మెరైన్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2021లో ఢిల్లీలో సివిల్స్ కోచింగ్‌లో చేరారు. 2022లో సివిల్స్‌లో అర్హత సాధించలేకపోయారు. రెండో ప్రయత్నంలో తాజాగా 790వ ర్యాంకు సాధించారు. జోషిబాబుకు సివిల్స్‌లో ర్యాంకు రావడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – టెక్కలి

సాయి మోహిని మానసకు 973వ ర్యాంకు



జిల్లాకు చెందిన రావాడ సాయి మోహిని మానస సివిల్స్ ఫలితాలలో 973వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు ప్రకాషరావు, ఉషారాణి ఉద్యోగులు కావడంతో 10వ తరగతి వరకు విద్యాభ్యాసం ఒకే చోట జరగలేదు. 1 నుంచి 4 వరకు సోంపేటలో వాణీ విద్యానికేతన్, 5వ తరగతి కంచిలి సెయింట్ జోసెఫ్ పాఠశాల, 6నుంచి 10 వతరగతి వరకు శ్రీకాకుళంలోని శార్వాణి విద్యానికేతన్‌లో చదివింది. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఎంబీబీఎస్ సీటు సాధించి ఆంధ్రామెడికల్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి విశాఖలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు విశాఖ ఐఏఎస్ అకాడమీలో సివిల్స్‌లో కోచింగ్ తీసుకున్నారు. తొలి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. రెండో ప్రయత్నంలో ప్రిలిమనరీలోనే వెనుదిరిగారు. అయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా మూడో ప్రయత్నంలో 973వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మోహినీని డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది, శ్రీకాకుళం నగరానికి చెందిన అంధవరపు సూరిబాబు అభినందించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

సాయి మోహిని మానస 'సాక్షి'తో మాట్లాడుతూ తాను ఈ స్థాయికి వచ్చేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని చెప్పారు. ఏం చదవాలనే విషయమై ఒత్తిడి తేకుండా నా ఇష్టానికి వదిలేస్తూ ప్రోత్సహించారని తెలిపారు. పేదలకు ఆరోగ్య సేవ చేసేందుకు ప్రభుత్వ వైద్యురాలిగా చేరానని, ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు సేవ చేసే అవకాశం సివిల్స్ ర్యాంక్ వల్ల దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె మానస తపస్సులా కృషి చేసి మంచి ర్యాంకు సాధించిందని తల్లిదండ్రులు ఉషరాణి, ప్రకాశరావు చెప్పారు. రెండు సార్లు సివిల్స్‌లో అర్హత సాధించనపుడు ఇక ప్రయత్నించవద్దని చెప్పినా పట్టు వీడకుండా చదివి విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. - శ్రీకాకుళం

మాన్యుల దురాక్రమణం మహిళ అసామాన్య రణం

నిర్మాణంలో ఉన్న ఈ భవనం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఫ్యామిలీకి, ఒక సాధారణ కుటుంబానికి మధ్య వివాదానికి వేదికగా నిలిచింది. వారసత్వంగా వచ్చిన భూమిలో ఎమ్మెల్యే గొండు శంకర్ సోదరుడు, ప్రముఖ వైద్యుడు గంగాధరరావు అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారంటూ సామాన్యురాలైన లోతుగెడ్డ కృష్ణవేణి అనే మహిళ అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఏకంగా ఫిర్యాదు చేయడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.



ఎమ్మెల్యే ఫ్యామిలీ X సామాన్య ఫ్యామిలీ

- జిల్లా కేంద్రంలో స్థల వివాదం
- తమ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని కృష్ణవేణి అనే మహిళ పోరాటం
- ఎమ్మెల్యే గొండు శంకర్ కుటుంబీకులు నిర్మాణం చేపడుతున్నారని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- రక్షణ కల్పించాలని వేడుకోలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో భూముల వివాదాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి. ఒకే భూమిపై ఇద్దరు ముగ్గురు వేర్వేరు పత్రాలు పట్టుకుని గొడవలు పడుతున్న సందర్భాలు వెలుగు చూస్తున్నాయి. నిర్మాణాలకొచ్చేసరికి అసలు బాగోతాలు బయటపడుతున్నాయి. తమ స్థలంలో కట్టడాలేంటని అసలు యజమానులు అడ్డుకుంటుండగా, క్రయ, విక్రయాల ద్వారా దఖలు పడిందని మిగతా వాళ్లు సమర్థించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో శ్రీకాకుళం నగరంలోని బలగలో ఓ స్థల వివాదం వెలుగుచూసింది. ఎమ్మెల్యే గొండు శంకర్ సోదరుడు, ప్రముఖ వైద్యుడు గొండు గంగాధరరావుకు, కొత్తూరుకు చెందిన లోతుగెడ్డ కృష్ణవేణి అనే మహిళకు మధ్య బలగ వార్డులో ఓ స్థలంపై వివాదం చోటు చేసుకుంది. ఇప్పుడిదే పెద్దదై ఏకంగా ఎమ్మెల్యే కుటుంబంపైనే ఫిర్యాదులకు దారితీసింది. కృష్ణవేణి గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.

బలగ వార్డులో డోల సూర్యనారాయణకు ఆస్తులుండేవి. అందులో 690/1లో స్థలాన్ని తమ కుమార్తె కాండవ జ్యోతికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. జ్యోతి తన తండ్రి ద్వారా దాఖలు పడిన స్థలాన్ని తన కుమార్తె లోతుగెడ్డ కృష్ణవేణికి ఇచ్చారు. ఆ మేరకు 1981 మార్చి 16న రిజిస్టర్ సెటిల్‌మెంట్ దస్తా వేజు నెం.837/81 దఖలు పరిచారు. అయితే, ఇదే స్థలంపై రౌతు జయలక్ష్మి అనే మహిళ తనకు గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ అయిందని తెరపైకి వచ్చారు. దీంతో కృష్ణవేణి, జయలక్ష్మి మధ్య స్థల వివాదం నడిచింది. దీనిపై అప్పట్లో కోర్టుకెళ్లగా.. జయలక్ష్మి పిటీషన్‌ను డిస్మిస్ చేసింది. ఆ తర్వాత సదరు స్థలంపై జయలక్ష్మి అప్పీల్‌కు వెళ్లిన దాఖలాల్లేవు. ఇంతలో ఈ స్థలాన్ని రౌతు జయలక్ష్మి విక్రయించినట్టు, ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్ సోదరుడు గొండు గంగాధరరావు కొనుగోలు చేసినట్టు తెరపైకి వచ్చింది.

ఎమ్మెల్యేపై పోరాటానికి దిగిన మహిళ..

కృష్ణవేణి అప్రమత్తమై జరిగినదంతా గొండు గంగాధరరావుకు, ఆయన తండ్రి జగన్నాథరావుకు వివరించారు. కోర్టు నుంచి స్టేటస్‌కో కూడా తీసుకొచ్చారు. తర్వాత ఏమైందో తెలియదు గాని అదే స్థలంలో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. దీంతో మున్సిపల్ అధికారులను ఆశ్రయించి, కోర్టు ఉత్తర్వులను చూపించారు. ఫలితంగా అప్పటికే జరుగుతున్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చేశారు. జరుగుతున్న పరిణామాలతో ఆందోళన చెంది సదరు స్థలానికి సంబంధించి కృష్ణవేణి ఏపీ హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. దీంతో ఆ స్థలంలో మళ్లీ నిర్మాణాలు జరగలేదు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఎమ్మెల్యే గొండు శంకర్ రాజకీయ పలుకుబడితో మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని నిర్మాణాలు ప్రారంభించారని.. మూడంతస్తుల మేర చకచకా నిర్మాణం కానిచ్చేశారని.. కృష్ణవేణి చెబుతున్నారు. ఇప్పుడా నిర్మాణాలపై కృష్ణవేణి అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించుకోకుండా మున్సిపల్ అధికారులు కూడా ఆ నిర్మాణాలకు అనుమతులిచ్చారని, గంగాధరరావు సోదరుడు ఎమ్మెల్యే కావడం వల్లే తలొగ్గారని ఆమె ఆరోపిస్తున్నారు. రూ. 2కోట్ల విలువైన భూమిని దౌర్జన్యంగా గుప్పెట్లోకి తెచ్చుకుని, నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అటు పోలీసు, ఇటు మున్సిపల్, జిల్లా అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. పక్కా డాక్యుమెంట్స్‌తో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా మంగళవారం విలేకర్ల సమావేశం పెట్టి జరిగినదంతా వివరించారు.

దౌర్జన్యం చేస్తున్నారు

కోర్టు స్టేటస్‌కో ఆర్డర్స్, హైకోర్టులో రిట్ ఉత్తర్వులను ధిక్కరించి త్వరితగతిన అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగి బెదిరిస్తున్నారు. మాకు ప్రాణహాని ఉంది. మాకు రక్షణ కల్పించి, అక్రమ నిర్మాణాలను తొలగించాలి.

– లోతుగెడ్డ కృష్ణవేణి



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న కృష్ణవేణి

కూర్మాల మృత్యుఘోషకు కారణం అశ్రద్ధే..





దేవదాయ శాఖ డీసీ సుజాతకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

- ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకూర్మంలో ఘోరం

గార: పవిత్ర శ్రీకూర్మం దేవాలయ ప్రాంగణంలో నక్షత్ర తాబేళ్లు మృతిచెందడం దురదృష్టకరమని, దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. మృత తాబేళ్ల దహనం ఘటన నేపథ్యంలో మంగళవారం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయ తాబేళ్ల పార్కును పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎంతో విశిష్టమైన క్షేత్రాల్లో శ్రీకూర్మం ఒకటని, ఇక్కడ తాబేళ్లు చనిపోవడం బాధాకరమన్నారు. అరుదైన జాతికి చెందిన నక్షత్ర తాబేళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటిని సంరక్షించడంలో అశ్రద్ధ వల్లే ఈ ఘటన జరిగిందని, అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ప్రతీదీ రాజకీయ కోణంలో చూడకుండా తిరుమలలో గోవులు చనిపోవడం వంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం దేవదాయ శాఖ డీసీ సుజాతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్, జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, బరాటం నాగేశ్వరరావు, పొన్నాడ రుషి, పీస గోపి, చిట్టి జనార్దనరావు, అంబటి శ్రీనివాసరావు, ఎచ్చెర్ల శ్రీధర్, మూకళ్ల తాతబాబు, బగ్గు అప్పారావు, అంధవరపు బాలకృష్ణమూర్తి, మార్పు దుర్గా పృథ్వీరాజ్, కొయ్యాన నాగభూషణం, పీస శ్రీహరిరావు, యాళ్ల నారాయణమూర్తి, రౌతు శంకరరావు, గొలివి వెంకటరమణమూర్తి, పల్ల పెంటయ్య, బరాటం నాగరాజు పాల్గొన్నారు.

తాబేళ్లు లెక్కల్లో తేడా ఎందుకు?

- కాంట్రాక్టర్‌ను నిలదీసిన దేవదాయ శాఖ డీసీ



రమణమూర్తిని నిలదీస్తున్న డీసీ సుజాత

గార: తాబేళ్ల లెక్కల్లో తేడాలు ఎందుకు వస్తాయని, ఎందుకు అంత అశ్రద్ధగా ఉన్నారని దేవదాయ శాఖ డీసీ సుజాత కాంట్రాక్టర్ రమణమూర్తిను నిలదీశారు. తాబేళ్ల దహనం ఘటనపై దేవదాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు మంగళవారం కూర్మనాథాలయానికి విచ్చేసి ఆరా తీశారు. 2022లో 286 తాబేళ్లుండగా, ఇప్పుడు వాటి సంఖ్య 212కు ఎలా పడిపోయిందని ప్రశ్నించారు. తాబేళ్లు చనిపోతున్న పరిస్థితుల్లో నిబంధనలు ఎందుకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులో గ్రీనరీ లేకపోవడం వల్లే చనిపోతున్నాయని గ్రీన్‌మెర్సీ ప్రతినిధి రమణమూర్తి తెలపగా, అప్పట్లో ఈవోగా పనిచేసిన ఈవో విజయకుమార్ స్పందిస్తూ గ్రీనరీ తొలగించలేదని, ఇంకా విరివిగా మొక్కలు నాటామని చెప్పారు. తాబేళ్ల పార్కును వాటికి అనుగుణంగా ఆలయంలోని వేరే స్థలంలో నిర్మించాలని డీసీ సుజాతను గార ఎంపీపీ గొండు రఘురామ్ కోరారు. ప్రతి నెలా ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం, పశుసంవర్థక శాఖ, అటవీ శాఖ పర్యవేక్షణ జరిగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

దేవదాయ శాఖ నిద్రమత్తు వీడాలి

- శ్రీకూర్మనాథాలయ ధర్మకర్త పూసపాటి అశోకగజపతిరాజు

గార: వరుస ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో దేవదాయ శాఖ నిద్రమత్తు వీడాలని శ్రీకూర్మనాథాలయ ధర్మకర్త పూసపాటి అశోకగజపతిరాజు అన్నారు. నక్షత్ర తాబేళ్ల దహనం నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించారు. స్వామి దర్శన అనంతరం మాట్లాడు తూ నక్షత్ర తాబేళ్లు ఇక్కడ ఉంటేనే దైవాంశం ఉంటుందన్నారు. ఎక్కడికో తరలించడం వల్ల ఆలయానికి ప్రాశస్త్యం తగ్గుతుందన్నారు. దేవదాయ శాఖ ధర్మకర్తలను గౌరవించాలని, దేవాలయ పరిస్థితులపై సమాచారాన్ని తెలియజేయాలని అన్నారు.



తాబేళ్ల పార్కును పరిశీలిస్తున్న పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే గొండు శంకర్

కూర్మనాథస్వామి ఆభరణాలు దశాబ్దాలుగా సింహాచలం దేవస్థానంలో ఉన్నాయని, ఇక్కడ ఉంచితే బాగుంటుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే శంకర్ స్పందిస్తూ నగలు ఇక్కడే ఉంచాలని అధికారులకు తెలియజేశామని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీసీ సుజాత, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌చార్జి వై.భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సాగునీటి కల సాకారమే లక్ష్యం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర జిల్లాల సాగునీటి భవితవ్యాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పాత, కొత్త ప్రాజెక్టులన్నింటినీ సమాన ప్రాధాన్యతతో పూర్తి చేసి, ప్రతి చివరి భూమికి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వంశధారపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నేరడి సైడ్ వియర్ వద్ద పేరుకుపోయిన ఇసుక మేటలను వెంటనే తొలగించి, ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా హిరమండలం రిజర్వాయర్‌కు నిరంతరాయంగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒడిశాతో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పనులు ఆలస్యం చేస్తున్న ఏజెన్సీలకు తక్షణమే నోటీసులు జారీ చేసి, టెండర్ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులకు నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ, పనులు నెమ్మదిగా సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొట్ట ఎత్తిపోతల పథకం పూర్తయితే 12 టీఎంసీల నీరు హిరమండలం రిజర్వాయర్‌కు తరలించవచ్చని, ఇది కీలకమైన ప్రాజెక్టు అని మంత్రి తెలిపారు. గొట్ట బ్యారేజ్ అప్రాన్ పనుల కోసం రూ.12.81 కోట్ల టెండర్లను వెంటనే పిలవాలని ఆదేశించారు. షట్టర్ల కుంభకోణంపై చర్చ సందర్భంగా, కోర్టు అనుమతి పొంది వెంటనే షట్టర్లను స్వాధీనం చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. నాగావళి-వంశధార నదుల అనుసంధాన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. రణస్థలం పైడిభీమవరం పారిశ్రామికవాడకు సాగునీటి ప్రాజెక్టుల నుంచి నిరంతరాయంగా నీటి సరఫరా ఉండేలా చొరవ చూపాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కోరారు. కళింగపట్నం, అంబల్లవలస ఎత్తిపోతల పథకాల పనులు పూర్తి చేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రిని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ మంత్రి రామానాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

క్లుప్తంగా

రోడ్డుకు అడ్డంగా గ్రానైట్ లారీ



చింతలపోలూరు వద్ద నిలిచిన గ్రానైట్ లారీ

మెళియాపుట్టి: మండలంలోని చింతలపోలూరు వద్ద గ్రానైట్ రాయితో వెళుతున్న లారీ సాంకేతిక కారణంగా రహదారికి అడ్డంగా నిలిచిపోయింది. సాయంత్రం సమయం కావడం, అధిక సంఖ్యలో రాకపోకలు కొనసాగించే రహదారి కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీనబంధుపురం గ్రామ పంచాయతీలో సుమారు 20కి పైగా గ్రానైట్ క్వారీలు ఉండటంతో రాకపోకలు సాగించే వాహనాల శబ్దాలతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గంజాయి కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష

మెళియాపుట్టి : మెళియాపుట్టి కూడలిలో 2023 ఏప్రిల్ 25న గంజాయితో పట్టుబడిన బులుమాలి అనే వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మంగళవారం కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడిది ఒడిశా రాష్ట్రం చడియాపడ గ్రామమని పోలీసులు తెలిపారు.

న్యాయమూర్తులకు బదిలీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పలువురు న్యాయమూర్తులకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. శ్రీకాకుళం ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి భరణికి నర్సీపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టుకు బదిలీ అయ్యింది. ఆమదాలవలస జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్.మణికి కాకినాడ, నరసన్నపేట కోర్టు న్యాయమూర్తికి పాలకొండకు బదిలీ అయ్యింది. పాలకొండ కోర్టు న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కి విజయనగరం జూనియర్ డివిజన్ సివిల్ కోర్టుకు, సోంపేట కోర్టు న్యాయమూర్తి ఎ.రాముకు విశాఖపట్నం బదిలీ చేశారు. టెక్కలి కోర్టు న్యాయమూర్తి హెచ్ఆర్ తేజా చక్రవర్తికి విజయనగరం బదిలీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి కె.శ్రీనివాస్ సోంపేట కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. విజయనగరం జిల్లా శృంగవరపు కోట నుంచి ఎస్.వాణి నరసన్నపేట కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

27న జిల్లా బీచ్ కబడ్డీ జట్లు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాదు ముసలినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీ స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం వద్ద నాగావళి రివర్ నదీతీరాన ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికలు జరుగుతాయని చెప్పారు. పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జట్లు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ సాధు శ్రీనివాసరావు (సెల్: 9441914214)ను సంప్రదించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లగేజీ వాహనం

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని జాతీయ రహదారిపై పాత పెట్రోల్ బంకు కూడలి వద్ద ద్విచక్ర వాహనాన్ని మంగళవారం ఉదయం 10.30 టాటా లగేజీ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో బి.సీతారాం అనే వ్యక్తికి రెండు కాళ్లు విరిగిపోయి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పల్ల శివాజీ, రేగాన వెంకటేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జె.ఆర్.పురం ఏఎస్సై డి.రమణమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్షతగాత్రులు లావేరు మండలం పైడియ్యవలసకు చెందినవారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఎస్పీలతో డీఐజీ సమీక్ష

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖ రేంజి పరిధిలోని ఎస్పీలు, ఇతర అధికారులతో డీఐజీ గోపినాథ్ జెట్టి మంగళవారం సమీక్ష నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగ నియంత్రణ, నిందితుల అరెస్టు, వారి ఆస్తుల జప్తు తదితర అంశాలపై చర్చించారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా, విస్తృత తనిఖీలు నిర్వహించాలని, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేసి వారిపై ఉన్న నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు తక్షణమే జారీ చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీరంలో.. ఇసుక దందా

- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- చదును చేసిన భూములను ఆక్రమించుకుంటున్న కూటమి నేతలు
- పట్టించుకోని అధికారులు



చిన్నకొవిరిపేట తీరంలో అటవీభూమిలో ఇసుక ఎత్తుకెళ్తున్న అక్రమార్కులు

పోలాకి: 'కాదేదీ అక్రమాలకు అనర్హం' అనే రీతిలో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. ఏకంగా సముద్ర తీరప్రాంతంలోనూ ఉప్పు ఇసుక దందా సాగిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పోలాకి మండలంలోని గుప్పెడుపేట, రాజపురం, డీఎల్‌పురం, కొత్తరేవు, అంపలాం, పల్లిపేట పంచాయతీల పరిధిలో వందల ఎకరాల విస్తీర్ణంలో వున్న అటవీ భూముల్లో ఈ దందా యథేచ్ఛగా నడుస్తోంది. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది అటవీ భూముల పేరుతో పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం అటవీశాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చిన్నకొవిరిపేటలో దౌర్జన్యం..

పోలాకి మండలం గుప్పెడుపేట పంచాయతీ చిన్నకొవిరిపేటలో తన ఆధీనంలోని భూమిలో ఇసుక తవ్వకాలపై నిలదీసిన మైలపల్లి నారాయణ అనే వ్యక్తిపై ఇసుకాసురులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. సర్వేనెంబర్–274 లో పట్టపగలే ఇసుకను తరలించి అక్కడే నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లను సైతం నిర్మిస్తున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1997లో ఇదే సర్వే నంబర్‌లో చిన్నకొవిరిపేట అటవీ భూముల సాగుహక్కుల విషయంలో అప్పటి హరిశ్చంద్రపురం ఎమ్మెల్యే, ఇప్పటి రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో చేసుకున్న ఒప్పందాలను సైతం కాదని తమ భూముల్లో ఇసుక ఎత్తుకెళ్లిపోతున్నారని వారు వాపోతున్నారు.

నిర్మాణాలు ప్రశ్నార్థకమే:

ఉప్పుఇసుకతో భవనాలు, రహదారులు నిర్మాణం చేపట్టతుండటంతో వాటి నాణ్యత సైతం ప్రశ్నార్థకంగా మారుతోం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుకవిధానంలో ఇసుక ఉచితం అన్నప్పటికీ వినియోగదారునికి చేరేసరికి ట్రాక్టర్ లోడ్ రూ.1500 నుంచి రూ.2వేల వరకు పలుకుతోంది. అందులో సగానికే కేవలం రూ.500 నుంచి రూ.1000కే ఉప్పు ఇసుకను కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. వాటిని కొన్నిచోట్ల నదీ ప్రాంత ఇసుకతో మిక్సింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల మండలంలో నిర్మాణం చేపట్టిన ఉపాధి సీసీ రహదారులు అన్నింటికీ ఇదే ఇసుక వినియోగించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇలా ఎత్తుకెళ్లి.. అలా చదునుచేసి..



అటవీభూముల్లో నిర్మాణాలు చేపడుతూ..

ఆగడాలకు అడ్డేలేదు



మా సాగులో వున్న అటవీ భూమిలో పట్టపగలే ఇసుకను తరలించుకుపోతున్నారు. అడ్డుపడిన నా భర్తపై దౌర్జన్యం చేసేందుకు సైతం వెనకాడలేదు. పెద్దమనుషుల ముసుగేసుకుని అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారు. గ్రామంలో అటవీ భూముల్లో ఇసుక ఎత్తుకెళ్లిన తర్వాత చదునుచేసి ఆ స్థలాలను కూటమి నాయకులు ఇష్టానుసారంగా అమ్మకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవటంలేదు.

– మైలపల్లి లావణ్య, బాధితురాలు, చిన్నకొవిరిపేట

ఐదు కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న గార మండలం పొగాకువానిపేట గ్రామానికి చెందిన దువ్వు సాయి సురేష్ రెడ్డి అలియాస్ సాయి అనే యువకుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వి.రామారావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గార మండలం పొగాకువానిపేటకు చెందిన దువ్వు సాయి సురేష్ రెడ్డి అలియాస్ సాయి ఐటీఐ చదువుతూ మధ్యలో మానేసి వెల్డింగ్ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం నెల్లూరు జిల్లాకు తరలించేందుకు 5.662 కిలోల గంజాయిని 3 ప్యాకెట్లుగా తయారు చేసి బ్యాగ్‌తో ఒడిశా నుంచి నడిచి వస్తుండగా పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు చెందిన వ్యక్తికి అప్పగించేందుకు గంజాయిని తీసుకొస్తున్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని సాయిని అరెస్టు చేశారు. సమావేశంలో ఎస్ఐ బి.లావణ్య, ఏఎస్ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న పూలే పార్కు వద్ద శనివారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు జీతాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఉషారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందుమతి, జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ రాజీవ్, జి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై కుట్ర



మాట్లాడుతున్న ఎస్.వి.రమణమూర్తి

శ్రీకాకుళం: ఓవైపు పాత పెన్షన్ అమలు కోసం ఉద్యోగులు కలిసికట్టుగా పోరాటం చేస్తుంటే ఇవేవీ పట్టని కేంద్ర ప్రభుత్వం పాత పింఛన్‌దారులకు హానికలిగించేలా పెన్షన్ సవరణ బిల్లు తీసుకురావడం దారుణమని ఎన్జీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్ వద్ద లోక్‌సభలో పెన్షన్ సవరణ బిల్లు ఆమోదంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్జీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకష్ణ, చింతల రామారావు, శ్రీనివాసరావు, తిరుమలరావు, జి.శ్రీనివాసరావు, హెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీపై దర్యాప్తు



విచారణకు హాజరైన దళిత యువకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని కేఆర్‌సీసీ కార్యాలయంలో ఎస్‌డీసీ బి.పద్మావతి విచారణ చేపట్టారు. తనకు సాంఘిక సంక్షేమ శాఖలోని వసతి గృహాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తానని డీడీ విశ్వమోహన్ రెడ్డి రూ.2,50,000 లంచం అడగ్గా దఫదఫాలుగా రూ.2,30,000 ఇచ్చినట్టు కొత్తూరు మండలానికి చెందిన దళిత యువకుడు ఎస్.ప్రసాద్ ఫిర్యాదు చేశాడు. అదనంగా రూ.20 వేలు ఇవ్వనందున డీడీ తనకు ఉద్యోగం ఇవ్వలేదని పేర్కొన్నాడు. ఇటీవల ఇదే శాఖలో ఎనిమిది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను డీడీ చేపట్టారని, అందులో తన పేరు లేకపోవడంపై ప్రశ్నించగా తనతో పాటు గజేంద్ర, పవన్ అనే యువకులపైనా కులదూషణ చేసినట్లు తెలిపాడు. తమ డబ్బులు ఇచ్చేయాలని ప్రసాద్ తల్లి దమయంతి నిలదీయగా, ఆమెను కూడా దూషించినట్లు చెప్పాడు. కాగా, బాధితులు మాత్రం విచారణ సంతృప్తికరంగా లేదని, ఏకపక్షంగా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పుస్తకం తిరగేద్దాం.. చరిత్ర తిరగరాద్దాం!

- జ్ఞాపిక శక్తి, భాషా పరిరక్షణకు పుస్తకాలే కీలకం
- పుస్తక పఠనం పెరగాలంటున్న విద్యావేత్తలు
- నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం



ఇంటి లైబ్రరీలో చదువుతూ..



ఒక అభిమాని ఇంటి షెల్ఫ్‌లో ఉన్న పుస్తకాలు

శ్రీకాకుళం కల్చరల్: నేటి సాంకేతిక యుగంలో పుస్తక పఠనం బాగా తగ్గిపోయింది. ముఖ్యంగా యువత స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోవడంతో పుస్తకాలు చదివే వారు బాగా తగ్గిపోయింది. మనలో ఒంటరితనాన్ని పోగొట్టి మరో ప్రపంచంలోకి విహరింపజేసే పుస్తకాలే మనకు నిజమైన నేస్తాలని విద్యావేత్తలు చెబుతున్నారు. రోజులో కొంత సమయమైనా పుస్తక పఠనానికి కేటాయించాలని కోరుతున్నారు. నేటి తరంవారికి పుస్తకాలు చదవడం అంటే కేవలం పాఠ్య పుస్తకాలు చదవడం అనే అభిప్రాయం ఉంది. అందుకే సాధారణ పుస్తకాల చదవడం మానేశారు. ఇంకొందరు మాత్రం పుస్తకాలపై ప్రేమ చూపుతునే ఉన్నారు. తాము కొనుగోలు చేసిన, సేకరించిన పుస్తకాలతో ఇంట్లోనే లైబ్రరీని ఏర్పాటు చేసుకుంటున్నారు. రోజులో సగభాగం అందులోనే గుడుపుతుంటారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.


ఏకైక నేస్తం..



మన వ్యక్తిత్వానికి, వికాసానికి అద్దం పట్టేది పుస్తకం. పుస్తక పఠనం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చు. అత్యంత ఉత్తమ సమాచార, ప్రచార, ప్రసాద సాధనం, మాధ్యమం పుస్తకమే.

– జంధ్యాల శరత్‌బాబు, రచయిత


యువత చదవాలి..



ఏకాగ్రత కోసం పుస్తక పఠనం అవలవాటు చేసుకోవాలి. పుస్తకాలు మన ఆలోచనా దృక్పథాన్ని పెంచుతాయి. నేటి తరం యువత కూడా సాహిత్యం చదవడంపై శ్రద్ధ పెంచాలి.

– ముట్నూరు ఉపేంద్రశర్మ, ప్రభుత్వ అధ్యాపకుడు, శ్రీకాకుళం


పుస్తకాలంటే ప్రాణం..



పుస్తకాలంటే నాకు పంచప్రాణాలు. నిత్యం పుస్తకాల మధ్యే ఉంటాను. మార్కెట్లోకి కొత్త పుస్తకం వస్తే ఇప్పటికీ కొనుగోలు చేసే చదువుతాను. పుస్తకాల నిలయాలైన గ్రంథాలయాలను కూడా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

– వాండ్రంగి కొండలరావు, నేషనల్ బుక్ ట్రస్టు క్లబ్ జీవితకాల సభ్యుడు


పుస్తక పఠనంపై ఆసక్తి..



మా టీచర్ వల్ల పుస్తకం చదవడం ఇష్టం పెరిగింది. ఆమె నిత్యం ఏదో ఒక పుస్తకం చదువుతుంటారు. నేను అడిగితే పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం చెప్పారు. ఆమె వద్దే పుస్తకాలు తీసుకొని చదివి మళ్లీ తిరిగి ఇచ్చేదాన్ని.

– యడ్ల నిహారిక, ఇంటర్ విద్యార్థిని, కేజీబీవీ

సాహిత్యాభిమానుల కోసం..



సాహిత్యాభిమానుల కోసం మా సంస్థ ఎప్పుడు ప్రాధాన్యమిస్తుంది. బాషాభివృద్ధి కోసం కూడా బస్సుద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వెళ్లి ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. ఎంతో పురాతమైన సాహిత్య పుస్తకాలను పరిరక్షిస్తున్నాం.

– ఎచ్చెర్ల రవి, మేనేజర్, విశాలాంధ్ర బుక్ హౌస్

మహిళల మనస్తత్వాన్ని మార్చలేం

- చెత్తను బయటపడేస్తారు.. కుళాయిలు విరిచేస్తారు..
- జెడ్పీ స్థాయి సంఘ సమావేశంలో ఎమ్మెల్యే కూన వ్యాఖ్యలు



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, సీఈఓ శ్రీధర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం విషయమై మాట్లాడుతూ మహిళలు ఇంట్లో చెత్తను తీసుకువచ్చి బయట పడేస్తున్నారని, పరిసరాలు ఎలా ఉన్నా వారికి అనవసరమని చెప్పారు. తాగునీటి విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు వీధి కుళాయిలు వద్దని, ఇంటింటి కుళాయిలే మంచివని చెబుతూ ఆడవాళ్లు కుళాయిల ట్యాపులు కట్టకుండా వదిలేసి వెళ్లిపోతారని, అవసరమైతే కుళాయిలను విరిచేస్తారని చెప్పారు. ఈ రెండు వ్యాఖ్యానాలు చేసిన అనంతరం మహిళలను కించపర్చటం తన ఉద్దేశం కాదంటూనే వారి మనస్తత్వం ఇలా ఉంటుందని, వారిని మార్చటం సాధ్యం కాదన్నారు.

గ్రంథాలయ వ్యవస్థ వృథా..

పంచాయతీలకు వచ్చే ఆదాయంలో గ్రంథాలయ పన్ను పోతుందని అంటూ గ్రంథాలయ వ్యవస్థే పనికిరానిదని కూన పేర్కొన్నారు. ఆ వ్యవస్థకు ఒక చైర్మన్, జీతం, ఇతర ఖర్చులు కూడా వృథాయేనని చెప్పారు. ఈ వ్యవస్థ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదన్నారు.

ప్రగతి పథంలో నడిపించాలి..

జిల్లాలో ఉన్న ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో రాజకీయాలకు అతీతంగా పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో చేపడుతున్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, పింఛన్లు తదితర ఖర్చుల వివరాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. పన్నులు వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జెడ్పీ సీఈఓ ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజు సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ చైర్మన్ సిరిపురం జగన్మోహనరావు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నేతలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్ తమ్మినేని సీతారాం, పార్టీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు మంగళవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేయాలని జగన్ సూచించినట్లు వారు తెలిపారు.

– ఆమదాలవలస/శ్రీకాకుళం పీఎన్ (కాలనీ)

అమ్మా వస్తున్నానంటూనే.. అనంతలోకాలకు..

- అనుమానాస్పదంగా విద్యార్థి మృతి
- లొద్దపుట్టి ఆర్‌హెచ్ కాలనీలో విషాదం



రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

గోపాల్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: 'అమ్మా...ఈ రోజు ఇంటికి వస్తున్నాను...' అని కన్న కొడుకు తల్లికి ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో ఆ తల్లి కొడుకుకు ఇష్టమైన వంటకాలు చేసి వేయి కళ్లతో ఎదురు చూడటం ప్రారంభించింది. ఉదయం ఫోన్ చేసిన కొడుకు రాత్రి పన్నెండు గంటలైనా ఇంటికి చేరకపోవడంతో ఫోన్ చేసింది. స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళనకు గురైంది. తెల్లారితే... కొడుకు చదువుతున్న కళాశాలకు ఫోన్ చేస్తే మృతి చెందాడన్న పిడుగులాంటి వార్తను చేరవేయడంతో ఆ తల్లి గుండె పగిలేలా విలపించింది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన నెయ్యిల నీలాద్రి(లడ్డూ), ఢిల్లేశ్వరీల కుమారుడు గోపాల్(19). విశాఖపట్నం జిల్లా తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో సెకెండియర్ చదువుతున్నాడు. తండ్రి నీలాద్రి గల్ఫ్‌లో కూలి పనులు చేస్తున్నాడు. సోమవారం తల్లికి ఫోన్ చేసి 'అమ్మా....ఈ రోజు ఇంటికి వస్తున్నాను' అంటూ చెప్పిన గోపాల్ అర్థ రాత్రి వరకు ఇంటికి చేరక పోవడంతో మంగళవారం ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసింది. గోపాల్ విజయనగరంలోని రైలు కింద పడి మృతి చెందినట్లు చెప్పడంతో తల్లి కుప్పకూలిపోయింది. కుమారుడు రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసేకునేంత పిరికి వాడు కాదని, కుమారుడు మృతి వెనుక కుట్రదాగి ఉందని తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. విద్యార్థి గోపాల్ మృతితో గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి.

భర్తే హంతకుడు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన బాలబొమ్మ భవానీ(21) అనే వివాహిత ఈ నెల 15న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కేసులో భర్తే హంతకుడని జె.ఆర్.పురం సీఐ అవతారం మంగళవారం జి.సిగడాం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. సంతవురిటి గ్రామానికి చెందిన బాలబొమ్మ వెంకటదినేష్ కృష్ణ, పాలఖండ్యాం గ్రామానికి చెందిన ధారబోయిన భవానీకి తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. కొన్నాళ్లుగా ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 15న వేకువజామున భవానీ మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా భర్త వెంకటదినేష్ కృష్ణ గొంతునొక్కి హత్య చేసినట్లు నిర్ధారించారు. ముద్దాయిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐ వై.మధుసూదనరావు పాల్గొన్నారు.

భర్తపై వేడి నూనె పోసిన భార్య

- అనంతరం గోడ దూకి పరారీ

పరవాడ: భర్తపై సలసల కాగే నూనెను పోసి పరారైన ఓ భార్య ఉదంతం విశాఖపట్నం జిల్లా పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలాపువానిపాలెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ బి.కృష్ణారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన గండికోట బాలకృష్ణ (30) ఇండియన్ రైల్వేలో లోకో పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన బూర్జ గ్రామానికి చెందిన నక్కా రమణమ్మను ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. నెల రోజుల క్రితం బాలకృష్ణకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు బదిలీ కాగా.. 20 రోజుల క్రితం కూర్మన్నపాలెం నుంచి సాలాపువానిపాలెం గ్రామానికి మకాం మార్చాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి బాలకృష్ణ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. అనంతరం భర్త గదిలో నిద్రపోగా భార్య రమణమ్మ హాల్లో పడుకున్నారు. మంగళవారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఆమె సలసల కాగే నూనెను భర్త బాలకృష్ణ మోహంపై పోసి గోడ దూకి పరారైంది. విషయం తెలుసుకున్న స్థానికులు తీవ్ర గాయాలతో ఉన్న బాలకృష్ణను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాలకృష్ణ కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్నాడు. తనపై అనుమానంతోనే భార్య రమణమ్మ వేడి నూనెతో దాడికి పాల్పడిందని.. 2024లో శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామంలో తమ మధ్య గొడవ జరగ్గా అప్పుడు యాసిడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిందని బాలకృష్ణ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. పరారీలో ఉన్న రమణమ్మ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ కృష్ణారావు చెప్పారు.